

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**AUGUST - 2015**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు లెక్చర్‌షిప్
# సత్యవాణి-క్రీస్తుసంఘము

స్థలము: క్రీస్తుసంఘము,
7-9-35 సాంబమూర్తివీధి, సత్యవాణి, కాకినాడ.

తేదీలు: 2015 నవంబరు 3,4,5,6 తేదిలలో
మంగళ, బుధ, గురు, శుక్రవారములు

సమయం: ఉదయం 10:00 గం॥లకు
మధ్యాహ్నం 2:00 గం॥లకు
సాయంత్రం 7:00 గం॥లకు

ప్రసంగికులు: బ్రదర్.జిమ్ కెల్లీ, యు.ఎస్.ఏ
బ్రదర్.రోజర్ రైట్, యు.ఎస్.ఏ
బ్రదర్.లూయిస్ రష్‌మోర్, యు.ఎస్.ఏ
బ్రదర్.రాజా నాయగమ్, కంగయామ్, తమిళనాడు
మరియు స్వదేశ సువార్తికులు

మీరు సకుటుంబ సపరివారముగా , మీ స్థానిక సంఘముతో కలసి రండి. భోజన వసతులు ఉచితం. మొదటి రోజున 20 రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలెను. అందరికి స్వాగతం.

బ్రదర్.జాషువా గూటం
బ్రదర్.రిక్కీ గూటం
0884-2363722; 9848 998547.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH


P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 36 | ఆగస్టు- 2015 | సంచిక - 1


## యేసు చేసిన బోధనలు -2

(Jesus and His Teachings)

"క్రీస్తు కూడా మీ కొరకు బాధపడి తన అడుగుజాడల యందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను"అని అపొ. పేతురు వ్రాసెను(1పేతురు2:21). యేసుక్రీస్తు బాల్యదశనుండి యౌవన ప్రాయము గల వానిగా ఎట్లు పెరిగెనో, ఆయన ఎట్టిమాదిరి జీవితమును మనకిచ్చి పోయెనోగతసంచికలోగమనించితిమి.గొప్ప మహిమాప్రభా వములు గల ఆయన జీవితబోధనలలోని మరికొన్ని సత్యములనుఇప్పుడుగమనించుదము.

యేసుదేవుని గొర్రెపిల్లయని యోహాను ప్రకటించగా విని యోహాను శిష్యులలోఇద్దరుయేసునువెంబడించిరి.యేసు వెనుకకు తిరిగి,వారు తన్ను వెంబడించుట చూచి మీరేమివెదకుచున్నారని వారి నడుగగా వారు రబ్బీ,నీవు ఎక్కడ కాపురమున్నావు? అని ఆయన నడిగిరి. వచ్చి చూడుడని ఆయన వారితో చెప్పగా వారువెళ్ళి,ఆయనయొద్దబసచేసిరి (యోహాను1:35-39).మనుష్యులు ఆయన యందు ఆసక్తిని కనుబరచగా యేసు వారిని-చేర్చుకొనుటయేగాక ఆయన వారి కాతిధ్యమిచ్చెను.ఆ యిద్దరలో ఒకడగు అంద్రెయ తన సహోదరుడైన సీమోనుకు మేము మెస్సీయను కనుగొంటిమని తెలిజేసి అతనిని

యేసునొద్దకు తోడుకొని వచ్చెను. యేసు ఏర్పరచుకొనిన 12గురు అపొస్తులలో వీరిద్దరున్నట్లుమనముగ్రహించుకొనగలము.

యేసు తన కొరకు శిష్యుల నేర్పరచుకొనుచు"నన్నువెంబడించుడి"యని వారిని పిలుచుచుండెను.నన్ను వెంబడించుడి యనుటలో ఆయన మాదిరి ననుకరించుడి యను భావము ఇమిడియున్నది.యేసు యొక్క జీవితములో గొప్ప శక్తి యున్నది.ఆయనను వెంబడించువాడు ఆ శక్తిని పొందగలుగును.యేసు సువార్తయే ఆత్మలను రక్షించుటకు దేవుని గొప్ప శక్తియై యున్నది(రోమా1:16).యేసు ఫిలిప్పు అనునతని కనుగొని నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను(యోహాను1:43).ఫిలిప్పు నతనయేలను మరొకని తోడుకొని వచ్చెను. యేసు సుంకపు మెట్టునొద్ద కూర్చుండి యున్న మత్తయి అను ఒక మనుష్యుని చూచి నన్ను వెంబడించుమని అతనితో చెప్పగా అతడు లేచి ఆయనను వెంబడించెను(మత్తయి9:9). ఒకనాడు శాస్త్రి ఒకడు వచ్చి బోధకుడా,నీవెక్కడికి వెళ్ళినను నీవెంట వచ్చెదనని ఆయనతో చెప్పెను. అందుకు యేసు నక్కలకుబొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవుగాని మనుష్య కుమారునికితలవాల్చుకొనుటకైనను స్థలములేదని అతనితో చెప్పెను.శిష్యులలో మరియొకడు ప్రభువా,నేను మొదట వెళ్ళి,నా తండ్రిని పాతిపెట్టుటకు నాకు సెలవిమ్మని ఆయనను అడుగగా యేసు అతనిచూచినన్ను వెంబడించుము;మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్మని చెప్పెను (మత్తయి8:18-22). ఈ రెండు సందర్భములలోను యేసును వెంబడింపగోరినవారు ఇహలోక సుఖములను కోరరాదనియు తల్లిదండ్రుల కంటే ఆయనను మనజీవితములో ఎక్కువ ప్రతిష్ఠించు కొనవలెననియు యేసు బోధించుచున్నట్లుమనముగ్రహించగలము.

గొప్పఆనక్తిగల యౌవనస్థుడొకడు యేసు యొద్దకు వచ్చి నిత్యజీవములో ప్రవేశించుటకు నాకు ఇకను కొదువ ఏమని ఆయనను అడిగెను. అందుకాయన నీవు పరిపూర్ణుడవగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదలకిమ్ము,అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను.అయితే అతడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆమాట విని వ్యసన పడుచు వెళ్ళిపోయెను(మత్త19:16-22). యేసును వెంబడించుట యనగా అహంను పరిత్యజించి,త్యాగజీవితమును జీవించుటయని యేసుక్రీస్తు బోధించెను. "ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని,తన సిలువ నెత్తు కొని నన్ను వెంబడింపవలెను."అని ఆయన చెప్పెను(మత్త16:24).తన సిలువ నెత్తుకొని ఆయనను వెంబడింపమనుటలో క్రీస్తుయొక్క శిష్యుడు కాగోరువాడు

శోధనలు,కష్టములు సహింపగోరువాడై యుండవలెనని ఆయన బోధించెను.క్రీస్తు కొరకు తమ్మును తాము ఉపేక్షించుకొనిన వారికి ఆయన ఇచ్చే బహుమానము చాలా గొప్పది. ఆయన యిట్లనుచున్నారు: "నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్కచెల్లెండ్రనైనను తల్లిదండ్రులనైనను భూములనైనను విడిచినవాడు ఇప్పుడు ఇహమందు హింసలతోపాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను రాబోవు లోకమందు నిత్యజీవమును నిశ్చయముగా పొందును"(మార్కు10:28-30).

యేసు పగలనక రాత్రనక బోధించుచుండెను. ఆయన సమయమును పోనీయక ఒక పట్టణమునుండి మరొక పట్టణమునకు వెళ్ళుచు సువార్తను బోధించెను.సువార్త నిమిత్తము మనుష్యులు ఆయనకు దగ్గరకు వచ్చుట కంటే ఆయనే వారి యొద్దకు వెళ్ళెను."యేసు వారి సమాజ మందిరములలో బోధించుచు,రాజ్యసువార్తను ప్రకటించుచు ప్రతి విధమైన వ్యాధిని స్వస్థపర్చుచు,సమస్త పట్టణములయందును గ్రామములయందును సంచారము చేసెను"అని మత్తయి9:35లో వ్రాయబడియున్నది. నేటి సువార్తికులు యేసుప్రభువు నుండి నేర్చుకొనవలసినది ఎంతో యున్నది.ప్రభువైతే ప్రజల యొద్దకు వెళ్ళి బోధించెను గాని మన సువార్తికులయితే ప్రజలే తమ యొద్దకు రావలెనని కోరుచున్నారు. అట్టివారు. ప్రభునకు యధార్థమైన సేవచేయువారు కారు. వారు ప్రభువుకంటే తమ సుఖమునే ఎక్కువ ప్రేమించిన వారగుదురు. మతమును వ్యాపారముగా మార్చువారిని యేసుప్రభువు ఖండించెను. "యూదుల పస్కా పండుగ సమీపింపగా యేసు యెరూషలేమునకు వెళ్ళి దేవాలయములో ఎడ్లను గొర్రెలను పావురములను అమ్మువారును రూకలు మార్చువారును కూర్చుండుట చూచి త్రాళ్లతో కొరడాలు చేసి గొర్రెలను,ఎడ్లనన్నిటిని దేవాలయము నుండి తోలివేసి,రూకలు మార్చువారి రూకలు చల్లివేసి,వారి బల్లలు పడద్రోసి పావురములు అమ్మువారితో...వీటిని ఇక్కడనుండి తీసికొనిపొండి;నా తండ్రి యిల్లు వ్యాపారపు ఇల్లుగా చేయకూడదని చెప్పెను"(యోహాను2:13-17).క్రైస్తవ మతమును వ్యాపారముగా మార్చువారు మన మధ్య లేకపోలేదు. అట్టివారు ఈ సంఘటన నుండి గొప్ప పాఠమును నేర్చుకొనవలసియున్నది.

దేవుని రాజ్యములో ప్రవేశించవలెనన్న ఒకడు తిరిగి జన్మించవలెనని యేసు బోధించెను. ఈ తిరిగి జన్మించుట యనునది శారీరకముగా కాదు గాని ఆత్మీయముగా జరుగవలెను. ఒకడు క్రొత్తగా జన్మించితేనే

గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని యేసు బోధించెను.అందుకు నీకొదేము అను పరిసయ్యుడు మునలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు?రెండవమారు తల్లిగర్భము నందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయనను అడుగగా యేసు ఒకడు నీటిమూలముగాను,ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను(యోహాను3:3-5). యేసు బోధించిన ఈ క్రొత్తజన్మ బాప్తిస్మమును సూచించుచున్నది.ఒకడు వాక్యమును బట్టి నీటిలో ముంచబడి. ప్పు డు క్రొత్తజన్మనొందిన వాడగును.ఇంకొక మాటలో ఆత్మయొక్క మాటల ద్వారా బాప్తిస్మము పొందినవాడు దేవుని రాజ్యములో ప్రవేశించునని యేసు బోధించెను.యేసునందు విశ్వాసముంచు వాడు నశింపడుగాని నిత్యజీవమును పొందునని యేసు బోధించెను.దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. ఆయన అద్వితీయ కుమారుడైన క్రీస్తునందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకై దేవుడాయనను పంపించెను.గనుక ఎవరయినను నశించుచున్న యెడల వారు తమకు తామే బాధ్యులుగాని క్రీస్తుకాడు.విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచలేదు గనుక వానికిఇంతకు ముందే తీర్పుతీర్చబడెను.ఆ తీర్పుఇదేవెలుగులోకములోనికివచ్చెను.గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యములు చేయు ప్రతివాడును వెలుగును ద్వేషించును.తన క్రియలు దుష్ క్రియలుగా కనబడకుండునట్లు వెలుగునొద్దకు రాడు.సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగాచేయబడియున్నవని ప్రత్యక్ష పరచబడునట్లు వెలుగునొద్దకు వచ్చునుఅని యేసు బోధించెను (యోహాను3:16-21). ఈ లోకములోనికి వచ్చినవెలుగు యేసుక్రీస్తు.పాపపుచీకటినిపారద్రోలుటకు ఆయన వచ్చెను.ఆయనను అంగీకరించిన వారి జీవితములో నుండి చీకటిని పారద్రోలుటకు ఆయన ఇప్పటికిని శక్తి కలిగి యున్నారు.నీవు యేసు నందు విశ్వాసముంచి,నీ పాపముల విషయమై మారు మనస్సుపొంది క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుచు పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము.అప్పటి నుండి ఆయన వెలుగులో నీవును,నీలో ఆయన వెలుగును కలిగి జీవించుము,నిత్య జీవిత మార్గమదియే.!

# సమాధాన బలి యొక్క వివరణ,ముగింపు

## (The Peace offering-An Explanation)

ఈ పాఠములో సమాధానబలి యొక్క వివరణ,ముగింపు,దానిలో యున్న భావార్ధమును గ్రహించుదము.పాతనిబంధనలోని అనేక రూపకములను యేసు ఎట్లు నెరవెర్చారో ఈ పాఠము మనకు తెలియ జేయును.ఈ బలి క్రీస్తులో నేరువెరుచు అనేక అత్మీయ సత్యములను మనకగుపరచును.ఈ పాఠము యొక్క అంతములో యేసు నిజమైన జీవాహార మెట్లు అయ్యారో తెలిసికొందము.

మెస్సీయ రాకవలన మానవ జాతి ఎంతయు సమాధానము కలిగి యుండునని లేఖనములలో ప్రవచింప బడెను.ముఖ్యంగా యెషయా9:6-7ను గమనించుదము."ఏలయనగా మనకు శిశువు పుట్టెను,మనకు కుమారుడు అనుగ్రహించబడెను.ఆయన భుజము మీద రాజ్యభారముండును.ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త,బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి,సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరుపెట్టబడును. ఇది మొదలు కొని మితి లేకుండ దానికి వృద్ధియు,క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును.న్యాయము వలనను నీతివలనను రాజ్యమును స్థిర పరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపాలన చేయును,సైన్యములకధిపతి యగు యెహోవా ఆశక్తి కలిగి దీనిని నేరవేర్చును".

**1.మెస్సీయ,సమాధానమునకు స్థావరము**

క్రీస్తు సమాధాన పాలనను స్థాపించ బోవుచున్నారనునది విదితమే. అది యుగయుగములు నిలుచును.క్రీస్తు సమాధానమునకు స్థావరమని చెప్పేమరొక లేఖనము యెషయా53:5.వధకు కొనిపో బడు దేవుని గొర్రెపిల్లను గూర్చి చెప్పే లేఖనములకిది ఆరంభము.ఆ లేఖకుడు మనందరి దోషములను,వాటిశిక్షను ఆయనపై దేవుడు మోపబోవుచున్నారని ప్రవచనపూర్వకముగా ఇక్కడ చెప్పుచున్నాడు.అంటే మన శిక్షను, భారమును బాధను,మరణమును దేవుడు ఆయనపై మోపగా మనకు సమాధానము కలుగును.

**2.రాజు,యాజకుడు ఇద్దరిమధ్య సమాధానము.**

మూడవ లేఖనము జెకర్యా6:12-13లలోమనకుకనబడును. "యెహోవా సెలవిచ్చునదేమనగా-చిగురు అను ఒకడు కలడు;అతడు తన స్థలములోనుండి చిగుర్చును,అతడు యెహోవా ఆలయమును వహించుకొని సింహాసనాసీనుడై యేలును, సింహాసనాసీనుడై అతడు యాజకత్వము చేయగా ఆ యిద్దరికి సమాధానకరమైన యోచనలుకలుగును". మెస్సీయను తరుచు

'చిగురు'అని ప్రవచనములలో సూచించబడెను. యెషయా4:2లో ఆయన యెహోవా చిగురు అని పిలువబడెను; అనగా ఆయన దేవుని కుమారుడు దేవుడని చెప్పబడెను. యెషయా11:1లో దావీదు తండ్రియైన యెష్షయి యొద్దనుండి చిగురు పుట్టును అనగా ఆయన మనుష్య కుమారుడని చెప్పబడెను. ఇట్లు క్రీస్తులో దైవత్వము, మానవత్వము సర్వ సంపూర్ణముగా మిళితమై యుండెను. జెకర్యాలో చిగురు అనబడిన ఆయన యెహోవా ఆలయమును కట్టును అని చెప్పబడెను. అనగా అది క్రీస్తురాజ్యము. ఆయన యాజకుని వలె పనిచేయుచు రాజువలె సింహాసనాసీనుడై పాలించును. ఆయన రెండు పదవులను అనుభవించును. సింహాసనాసీనుడై రాజ్యము చేయుచు యాజకునివలె పరిచర్య గావించును. ఈరెండు పదవులను ఆయన సమైక్యపరచును. ఆయన రాజు మరియు ప్రవక్త. న్యాయమును, చట్టమును స్థిరపరచి అమలుపరచువాడు రాజు మరియు చట్టము నుల్లంఘించువానికి శిక్షవిధించు వాడు రాజు. గనుక ఆయన నీతిన్యాయ ములు తన రాజరికము వలన విశదమగును. అయితే ఆయన అదే సింహాసనమునుండి యాజకునిగా కూడ పనిచేయును. యాజకుడైతే రాజు యొక్క చట్టమునుల్లంఘించిన వాని పక్షముగా ఎల్లప్పుడు విజ్ఞాపన చేయుచుండెను. యాజకునిగా అపరాధ విషయంలో రాజు తన కృపను, క్షమాపణను, దయను కనుపరచవలెనని విజ్ఞాపన చేయును. ఈ రెండు పదవులు ఒకదానికొకటి భిన్నముగా యున్నట్లుగుపడినను, క్రీస్తు ఈ రెంటిని కలిపి సమాధానమును నెలకొల్పును. జెకర్యా 9:9-10 ఇట్లు చెప్పుచున్నది;"సీయోను నివాసులారా, బహుగా సంతోషించుడి; యెరూషలేము నివాసులారా ఉల్లసముగా ఉండుడి; నీ రాజునీతి పరుడును రక్షణగలవాడును దీనుడునై, గాడిదను గాడిదపిల్లను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడు....నీ రాజు సమాధానవార్త అన్యజనులకు తెలియజేయును; సముద్రము నుండి సముద్రము వరకు యూఫ్రటీసు నది మొదలుకొని భూదిగంతముల వరకు అతడు ఏలును ". యేసుక్రీస్తు సార్వజనిక సమాధానమునకు కర్తయని సూచించు అనేక పాతనిబంధన లేఖనములలో యివి కొన్ని మాత్రమే.

సమాధాన బలి అంతిమ దశలో ప్రత్యక్ష గుడారము యొక్క ఆవరణలో దేవుడిచ్చువిందునుజ్ఞాపకముంచుకొనుము. యిది ఆయనకు, ఆయన ప్రజలకు మధ్యఏర్పడిన పరిపూర్ణ సమాధానమును సూచించును. యేసుక్రీస్తు చేసిన బోధలలో యిట్టి కొన్ని ఉదాహరణలు మనము గమనించ వచ్చును.

తప్పిపోయిన కుమారుడు తండ్రి యొద్దకు తిరిగిరాగా తండ్రి క్రొవ్విన దూడను వధించి గొప్పవిందు చేసాడు.

తన బిడ్డలతో సమాధానమేర్పడినప్పుడు తండ్రి యొక్క సంతోషము ఇందులో మనకు కనవడును. అందువలననే హెబ్రీయులు సమాధాన బలి విందును దేవుని ఆలయప్రాంగణలో,అనగా ఆయన యింటిలో అరగించేవారు.

దేవుడు యిచ్చు మరొక గొప్ప విందును గూర్చిన లేఖనభాగము మత్తయి22:1-14లో మనకగుపడును. రాజు యొక్క కుమారుని వివాహ సందర్భముగా రాజు యిచ్చిన విందు యిది. పిలువబడిన వారిని రప్పించుటకు అతడు తన దాసులను పంపగా వారు రానొల్లకపోయిరి. అతడు"ఇదుగో నా విందు సిద్ధపరచియున్నాను,ఎద్దులును క్రొవ్విన పశువులును వధింపబడి యున్నవి. అంతయు సిద్ధముగా యున్నది; పెండ్లి విందుకు రండని"కబురు పంపెను. గనుక దేవుడు తన విందు బల్ల యొద్దకు పిలువ బడినవారికి ఆత్మీయ విందు నొకటి సిద్ధపరచుచున్నారు. ఆయన తన పెండ్లిశాల నింపబడవలెనని కోరుచున్నారు(మత్తయి22:10).

లూకా 14:15-24లో చెప్పబడిన రాజు విందులో కూడ రాజు. తన విందుశాల పిలువబడిన వారితో నింపబడాలని కోరుచున్నట్లు తెలియనగును. ఆవిందు క్రీస్తురాజ్యములో సిద్ధపరచబడినది. ఎవరైతె దేవునితో నిబంధన సంబంధము కలిగి యుందురో వారి కొరకే అదిసిద్ధపరచబడెను. ఆహ్వానమును నిర్లక్ష్యము చేయు వాడెవడైనను వానికి దేవుని విందుకు పిలుపు వుండదు.

3.దేవుని బల్ల ఆయన రాజ్యములో యున్నది.

లూకా 22:24-30లో యేసుప్రభువు యొక్క అపొస్తలులు దేవుని రాజ్యములో ఎవడు గొప్పవాడో యని తమలో తాము తర్కించుకొనుచుండిరి. అందుకాయన"గొప్ప వాడెవడు?భోజన పంక్తిని కూర్చుండు వాడా?పరిచర్య చేయువాడా?పంక్తిని కూర్చుండు వాడే గదా?అయినను నేను మీ మధ్యను పరిచర్య చేయువాని వలె ఉన్నాను.గనుక నా తండ్రి మీకు రాజ్యమును నియమించి నట్టుగా,నా రాజ్యములో నా బల్ల యొద్ద అన్నపానములుపుచ్చుకొని సింహాసనముల మీద కూర్చుని ఇశ్రాయేలు పండ్రెండు గోత్రముల వారికి మీరు తీర్పుతీర్చుటకై నేనును మీకు రాజ్యమును నియమించుచున్నాను(లూకా22:21-30). యిది ప్రభురాత్రి భోజనము కాదు.అది దేవుడిచ్చు ఆత్మీయ విందు,దానిలో ఆత్మీయాశీర్వాములన్నియు యున్నవి.

యేసుక్రీస్తు లేవీకాండములోని సమాధాన బలియొక్క నెరవేర్పుని తెలియజేయు అనేక వచనములలో యివి కొన్ని మాత్రమే. హెబ్రీ13:10 యిట్లు తెలియజేయుచున్నది "మనకొక బలిపీఠమున్నది;దాని సంబంధమైన వాటిని తినుటకు గుడారములో సేవచేయువారికి

అధికారము లేదు". మనకొక బలిపీఠమున్నది,క్రైస్తవులు దాని ఆశీర్వాదములు తినుటకు హక్కుగలవారని ఈ లేఖనము చెప్పుచున్నది.

హెబ్రీయుల పద్ధతికి ఇంకా కట్టుబడియున్నవారికి క్రీస్తుసిలువ ద్వారా లభించు ఈ ఆత్మీయాశీర్వాదములలో పాలువుచ్చుకొనే హక్కులేదు. నిజ స్వరూపము బయలుపరచబడిన తరువాత కూడా లేవీయులనీడలో యుండగోరువారికి క్రీస్తు బల్లయొద్ద స్థానములేదు. ఆ పాత పద్ధతి ఎత్తివేయబడెను,దాని బలులను దేవుడిక అంగీకరించరు,ఆ చట్టమును క్రీస్తు మేకులతో సిలువకు కొట్టివేయుట జరిగినది(కొలస్స 2:14). కాబట్టి యూదుల సంబంధ మైన అన్నపానముల విషయములోనైనను పండుగ అమావాస్య విశ్రాంతి దినమను వాటి విషయము లోనైనను ఎవడును మనకు తీర్పుతీర్చ అవసరములేదు(కొలస్స2:16).

"కాబట్టి గొర్రెపిల్ల పెండ్లి విందుకు పిలువబడినవారు ధన్యులు" (ప్రకటన19:9).

**4.సమాధాన బలిపశువు యొక్క శరీరము**

బలి పశువు యొక్క శరీరమే ఆలయప్రాంగణములో ఆరాధకునికి తన కుటుంబానికి ఆహారముగా దేవుడనుగ్రహించారని గుర్తించుకొనుము. ఆ శరీరమే దాని రక్తాన్ని పరిహారార్థముగా అర్పించెను. పాపపరిహారము వలన సహవాసము పునరుద్ధరించబడును.దేవుని కుటుంబములో లేనివారికి ఈ విందులో పాలుపొందే అర్హతలేదు."ఆయనతో కూడ సహవాసము గలవారమని చెప్పుకొని చీకటిలో నడిచిన యెడల మనమాబద్ధమా డుచు సత్యమును జరిగింపకుందుము. అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులునుగా చేయును" (1యోహాను 1:6-7). అనగా మన పాపములను పవిత్రపరచుకొనే హక్కు మనకున్నది. యేసుక్రీస్తు యొక్క విందు బల్లలో మనకు లభ్యమగు ఆత్మీయ ఆహారము అది.

**5.దేవుని ఆహారము**

సమాధాన బలిపశువు యొక్క శరీరము దేవుని ఆహారమని పిలువబడినది "అది యెహోవాకు ఇంపైన సువాసనగల హోమము". "అది యెహోవాకు హోమరూప మైన ఆహారము"(లేవీ3:5,11). దీనిని బట్టి ఈ విందును ఆరాధించేవారు మాత్రమే గాక, తండ్రి యైన దేవుడు కూడ దీనినారగించును. నిజానికి బలిపశువు యొక్క క్రొవ్వు దేవునికి హోమరూపమైన ఇంపైన సువాసనగల ఆహారము. తప్పిపోయిన కుమారుడు,అతని తండ్రి ఎట్లు విందును అనుభవించుదురో అట్లే

లేవీకాండములోని సమాదానబలి అర్పణ విందు వున్నది.

ప్రకటన3:20లో యేసు ఇట్లు చెప్పారు;"ఇదిగో నేను తలుపునొద్ద నిలచుండి తట్టుచున్నాను.ఎవడైనను నా స్వరం విని తలుపుతీసిన యెడల నేను అతని యొద్దకువచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము''.పాతనిబంధనలోని రూపకముల యొక్క నిజస్వరూపమును తెలియజేయు అనేక లేఖనభాగములలో యివికొన్ని మాత్రమే.

**6.శాంతిని నేననుగ్రహించుచున్నాను**

యేసుక్రీస్తు శాంతికి ఆధార భూతుడని చెప్పుపాతనిబంధన ప్రవచనముల నెరవేర్పు తెలియజేయు లేఖనములను కొన్నిటిని చూద్దాం.

"శాంతిని మీకను గ్రహించున్నాను. లోకమిచ్చునట్లుగా, నేను మీకనుగ్రహించుటలేదు. మీ హృదయములను కలవరపడనియ్య కుడి"(యోహాను14:27)."నా యందు మీకు సమాధానము కలుగునట్లు ఈమాటలు మీతో చెప్పుచున్నాను. లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి,నేను లోకమును జయించియున్నాను'' (యోహాను16:33).

రోమా5:1-3లో యేసుక్రీస్తు యొక్క రక్తము వలన మనము సమాధానము కలిగియున్నామని పౌలు చెప్పుచున్నాడు.మనము దానిలో నిలిచి యుండాలి. ఎఫెసి 2:11-17లో క్రీస్తు మనకు సమాధానమై యున్నారని పౌలు చెప్పాడు. ఆయన యూదులను, అన్యజనులను తన శరీరమందు సమాధాన పరచియున్నారు.ఆయన శరీరమే ఆయన సంఘము.గనుక"క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏల నియ్యుడి;ఇందుకొరకే మీ రొక్కశరీరముగా పిలువబడితిరి"(కొలస్స3:15).మానవ జాతులందరికీ దేవునికి మధ్య సమాధాన కారకుడు క్రీస్తు ఒక్కడు మాత్రమే యని పౌలు వక్కాణించుచున్నాడు.

**7.పరలోకమునుండి దిగివచ్చిన ఆహారము**

లేవీకాండము 3:11లో చెప్ప బడిన యెహోవా ఆహారమునకు యోహాను సువార్త 6లో యేసు చెప్పిన పరలోకము నుండి దిగివచ్చిన ఆహారముకు గల ఆశ్చర్య కరమైన సారుప్యములను ఇప్పుడు గమనించుదము.

లేవీకాండములోని రూపకమును ఉద్దేశించి యేసు మాటలాడుచుండుట విదితము.లేవీకాండము3:11,యోహాను6లు నిజస్వరూపమునకు ఛాయలుగా కనబడును.యేసు 5000 మందికి అద్భుత రీతిగా ఆహారము పెట్టెను.తినగా మిగిలినవి 12 గంపలు వారు ఎత్తిరి. ఎవరు ఆకలిగా లేరు.యూదులు దీనిని చూచినప్పుడు ఆయనను బలవంతముగా

రాజును చేయగోరిరి.యేసు దీనినెరిగి యుండెను.తమకు భౌతిక ఆహారము నిచ్చు రాజును వారు కోరుకొనుచుండిరి.అయితే యేసు యొక్క పని భౌతికం కాదు.గాని ఆత్మకు శాంతినిచ్చు ఆహారము ననుగ్రహించుటే తన పని యని యేసు వారికి వివరించెను. తమ భౌతికావసరముల కొరకు ఆయనను రాజుగా వారు చేయ జూచుచున్నందున ఆయన వారినుండి తొలగి కొండకు ఒంటరిగా వెళ్లెను.

యేసును వారు మరునాడు సముద్రపుటద్దరికనుగొని"బోధకుడా నీవెప్పుడు ఇక్కడికి వచ్చితివని అడుగగా యేసు-మీరు సూచనలు చూచుట వలన కాదుగాని రొట్టెలు భుజించి తృప్తిపొందుటకే నన్ను వెదకు చున్నారని చెప్పెను" (యోహాను6:25).వారాయన బోధను బట్టి గాక భోజనమును బట్టి ఆకర్షితులగుచున్నారనునది ఎవడైనను గమనించవచ్చును. వారు చూచిన అద్భుతమును బట్టి ఆయన దేవుని ప్రవక్తయని గమనించి ఆయన యిచ్చు ఆహారములో గాక,నిత్యజీవాహారములో ఆసక్తిని వారు కనబరచ వలసి యుండెను.

**8.మోషే మరియు మన్నా**

వారు యేసును మోషేతో పోల్చుటకు మొదలిడిరి.మా పితరులు మన్నాను భుజించిరని ఆయనతో చెప్పిరి. యేసుయిచ్చు జీవాహారమునకు భౌతిక మన్నాకు గొప్ప వ్యత్యాసమున్నదని ఆయన వారికి బోధించెను. యేసు యిచ్చు జీవాహారము దేవునితో గల సహవాసము.దానిని దేవుడు యేసు ద్వారా అనుగ్రహించును.మన్నా ఒక ఛాయ,యేసు దాని నిజస్వరూపమైన జీవాహారము.

యోహాను6లో యున్న బోధ ప్రభురాత్రి భోజనమునుగూర్చి కాదు.అది పస్కా యొక్క రూపకమైయున్నది.మత్తయి 26:26-29;మార్కు14:22-26 మరియు లూకా24:14-23ను చూడుము.యోహా6 లో యేసు కల్వరిసిలువలో అర్పింపబడబోవు తన శరీరమును గూర్చియు చిందింప బడబోవు రక్తమును గూర్చియు బోధించెను.

యేసు ఆత్మీయ సంగతులను గూర్చి చెబితే యూదులు భౌతికంగా ఆలోచించారు."యిది కఠినమైనమాట, యిది ఎవడు వినగలడని వారు చెప్పుకొనిరి' (యోహా6:60).అనేకులు వెనుకజేసి మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు. వారు వెళ్లిపోకముందు,"ఆత్మయే జీవింపజేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము,నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి" యని ఆయన వారితోచెప్పెను (యోహాను6:63).ఆ ప్రజలు ఆయనను విడిచిపోయినప్పుడు,యేసు " మీరు కూడ వెళ్లిపోవలెనని యున్నారా? అని ఆ పండ్రెండు మందిని అడుగగా,

సీమోనుపేతురు ప్రభువా యెవని యొద్దకు వెళ్లుదుము? నీవే నిత్యజీవపుమాటలుగల వాడవు, నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగియున్నా మని ఆయనతో చెప్పెను"(యోహాను6:67-69).

ముగింపు: సమాధాన బలియొుక్క వర్తమానము మనము గుర్తించుకోవాలి. క్రీస్తేమనకు సమాధానమై యున్నారు. ఆ సమాధానము ఆయన రక్తమాంసముల వలన మనకు సాధ్యమాయెను. సిలువపై ఆయన అనుగ్రహించిన విమోచన యాగమును విశ్వాసము వలన మనము అరగించాలి. విమోచింపబడిన ఆత్మలు క్రీస్తు యాగము ద్వారా దేవునితో సమాధానము కలిగి యుండుట గమనించి నప్పుడు యిది ఆయనకు ఇంపైన సువాసన గలహోమ మని గుర్తించుట తేలికయే.

## విశాల మార్గము, ఇరుకు మార్గము
## (The Broad and Narrow Ways)

జీవితంలో ప్రతివాడును ఒక ప్రాముఖ్యమైన నిర్ణయమును గైకొనే సమయం వచ్చును. అట్టివాడు విశాలమార్గమునో లేక ఇరుకుమార్గమునో ఎంచుకొనవలసి వస్తాది. కొండమీదతాను చేసిన ప్రసంగములో క్రీస్తు ఈ సత్యమును యిట్లు తెలియజేసారు;"ఇరుకు ద్వారమున ప్రవేశించుడి;నాశనమునకు పోవుద్వారము వెడల్పును,ఆ దారి విశాలమునైయున్నది. దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు , జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునైయున్నది.దాని కనుగొనువారు కొందరే'' (మత్తయి 7:13-14). ప్రభువు చెప్పినదానిని త్రీవముగా ఆలోచించుము. అది ఆనాటి వారికే కాదు నేడు జీవించుచున్న మనకును వర్తించును.

మొదటిగా రెండు మార్గములు లేక రెండు ద్వారములున్నవని గ్రహించుము. ఎన్నియున్నాయి? రెండే రెండు,అంతకు ఎక్కువ యేమిలేవు. అంటే మనం ఈ రెండింటిలో ఏదో ఒక దానిలో పయనించ బోవుచున్నావు. ఇంకొక మాటలో ఒకడు ఒకే సమయమందు విశాలమార్గమున,ఇరుకుమార్గమున పయనించలేడు,పయనించ బోడు కూడ. ఇందులో మధ్యస్థమార్గమేదీ లేదు. నీవు విశాలమార్గమున యున్నట్లయితే,ఇరుకు మార్గమున పయనించలేవు.

తదుపరి ఒకటి విశాలమార్గము రెండవది ఇరుకుమార్గము అనిగమనించుము. విశాలమార్గములో చాల స్థలము ఉండును,దానికి అనుమానం యేమిలేదు. గాని ఇరుకు మార్గము దానికి పూర్తిగా భిన్నము. విశాల మార్గము సంకుచితమని ప్రభువు చెప్పలేదు గాని ఇరుకుద్వారము,మార్గము సంకుచితమని ఆయన చెప్పినట్లు గమనించుము. అంటే ఒకటి ఒంకరటింకరగా యుండును,రెండవది

అనేకులు విశాలమార్గమున యుందురు గాని ఇరుకుమార్గమున యుండే వారు కొందరేయని ప్రభువు చెప్పుచున్నారు. దీనిని బట్టి ఒకటి ప్రఖ్యాతిగాంచినది. గాని రెండవది దానికి భిన్నమైనది. ఆయన చెప్పుచున్నదానిని గూర్చి క్రీస్తుబాగుగా ఎరుగును. చరిత్ర ఆ సత్యమును మనకు బయలు పరచుచున్నది. అంతేకాదు, మన చుట్టు చూస్తే ప్రభువు చెప్పినది యదార్థమని గమనించగలము.

ఇందులో విచారకరమైనది యేమంటే ఈ రెంటిలో ఒకటి నాశనముకు నడుపును, అది విశాలమార్గము. అనేకులు ఈ విశాలమార్గమున పయనింతురని యేసు చెప్పినందున, వారందరు ఎక్కడికి పోవుచున్నారో ఎరుగుదుము. అయితే వేరొక మార్గము సంగతియేమిటి? ఇరుకుమార్గము జీవమునకు నడిపించునని చెప్పి దానిలో ప్రవేశించువారు కొందరేయని యేసు చెప్పెను. అంటే పరలోకము చేరుకొనేవారు కొందరే యని మనం ఎరుగుదుము. అనేకులు రక్షింపబడవచ్చును, గాని నశించిపోయేవారి సంఖ్యను బట్టి వారు కొందరేయని అగుపడును. రాబోవు లోకములో రక్షింపబడే వారు కొందరే.

అందరును ఇరుకుమార్గమున ప్రవేశించవలెనని క్రీస్తు ఆహ్వానించుచున్నారు. ఆయన ఎవరిని బలవంతము చేయరు. గాని ఆహ్వానించుచున్నారు. దానిలో ప్రవేశించిన వానిని ఆయన తప్పక ఆశీర్వదించును. అయితే ఒకడు కొరుకోన్నట్లయితే అతడు విశాలమార్గమున పయనించవచ్చును. మానవుడు నైతిక స్వేచ్ఛగలవాడు గనుక, తన ఎంపికను తాను చేసికొనవచ్చును.

ఇరుకుమార్గములో పయనించుట అంటే ప్రభువుతో పయనించుటయే, గాని విశాల మార్గమున పయనించువాడు అపవాదితో పయనించును. మానవుడు ఇరుకుద్వారము న పయనించవలెనని క్రీస్తు ఎల్లప్పుడు విజ్ఞాపన చేయుచున్నారు. గాని అపవాది కూడ వానినిలాగుకొనడానికి ఎల్లప్పుడు కష్టపడుచునే యుంటాడు. ప్రభువుకు, సాతానుకు మధ్య ఈ యుద్ధము కొనసాగుచుండును. దీనిని నీవు గమనించగలవు. అంతే కాదు తాను ఎవరితో యుండునో ఒకడు నిశ్చయించుకొనిన తరువాత అతడుకూడ ఆ యుద్ధములో ప్రవేశించును.

నీవు విచక్షణగల వయస్సునకు చేరినవాడవైతే ప్రభువు పక్షమున యుండుటకు నిశ్చయించుకొనుము. ఒక వేళ నీవు అపవాదితో నడుచుచు యుంటే వానిని విసర్జించి, నీ కొరకు మరణించిన యేసు ప్రభువు పక్షమున చేరుము. నీవు సత్యమును వినునప్పుడెల్లా, దానినంగీకరింతువో లేదో నీవే నిశ్చయించుకొనవలెను.

క్రీస్తుసువార్తకులో బడుటద్వారా ఇరుకుమార్గమున నీవు ప్రవేశించవచ్చును. నీవు ప్రభువుకు నమ్మకముగా జీవిస్తు ఆ మార్గములో పయనించిన యెడల ఆయన పరలోక ద్వారములనొద్దకు నిన్ను

ఒకానొక దినమందు నడిపించును. (యోహాను 14:6)
"నేనే మార్గమును,సత్యమును జీవమునై
యున్నానని''క్రీస్తు చెప్పెను

-జె.సి. ఫోట్

# బైబిలు గ్రంధకర్త యెవరు?-2

అనావేశ చరిత్రకారులు గొప్ప వ్యక్తుల చరిత్రను వ్రాయునపుడు ఆ వ్యక్తుల సుగుణాలనే ఎత్తి చూపించుచు, దుర్గుణాలపై నిశ్శబ్దముగ యుందురు. బైబిలు పాపమును ద్వేషించుటచే అందలి వ్యక్తుల నదలవాట్లనే కాక వారి లోపములనుకూడ బయలుపరచుచున్నది. గొప్పనీతి సూత్రములను బోధించిన వాడని అది నోవహును గూర్చి ఒకవైపున చెప్పినను,రెండవ వైపున అతడు ఓడలో నుండి వెలుపలికి వచ్చిన తరువాత మద్య పానముచే మత్తుడైనట్లు కూడతెలియజెప్పు చున్నది. అబ్రహాము దేవుని మిత్రుడని, విశ్వాసులకు తండ్రియని మంచి పేరును బడసినవాడే అయినను అతడొకమారు మోసగానివలే ప్రవర్తించినట్లు బైబిలు చెప్పుచున్నది. మోషే గొప్పశక్తివంతుడైన మానవుడని,రాబోవు క్రీస్తుమాదిరి నున్న వాడని మనకందరకు తెలిసినదే. అయితే పాపము చేయుటచే అతడు వాగ్దానము చేయబడిన దేశములో ప్రవేశించలేకపోయె నని బైబిలు చెప్పుచున్నది. దేవుని హృదయ సంబంధుడని దావీదు మంచి పేరును సంపాదించుకొనెను. అట్టివాడు మానవ చరిత్రయంతటిలోను ఘోరమైన నేరమును గావించినట్లు మానవ గ్రంధకర్త యెవడును వ్రాసి యుండలేదు. అయితే బైబిలు దానిని తప్పని చెప్పుచున్నది. మానవ లిఖిత చరిత్రకును,బైబిలునకును మధ్యగల ఈ భేదమును చూచిన తరువాత బైబిలు గ్రంధకర్త మానవుడు కానేరడని మనము అనుమతించక తప్పదు.

## దాని ఏకత్వము

వివిధ కాలములలో నివసించిన ఆయాజాతులలోని,తరగతులలోని40మందిని వారి స్వదుద్దేశముల నుపయోగించి ఒక అంశముపై ఒక గ్రంధమును తయారు చేయుడని మనము అడిగిన యెడల వారు వ్రాసిన గ్రంధమంతయు,విభిన్న సంగతుల తోను,స్వవిరుద్ధ సమాచారముతోను నిండియుండ గలదనుటలో సందేహము లేదు.

రకరకాల వృత్తులను కలిగి వివిధకాలములలో నివసించిన40మంది మనుష్యులచే 1600సం॥లలో లిఖింపబడిన66పుస్తకముల సంపుటియే బైబిలు. వారిలో కొందరు గొల్లలు,మరి కొందరు పల్లెవారు,ఒకడు వైద్యుడు,మరి యొకడు తృణీకరింపబడిన సుంకరి. వారు వివిధ కోణముల నుండి అనేక అంశములను గూర్చి వ్రాసిరి. అయినను వారి యందరి కృషిని సంపుటిగా చేసి

చూస్తే వారందరు ఒకే ముఖ్యాంశమును అనగా మానవుని రక్షణను గూర్చి ఒకరి నొకరు విరుద్ధముగా కాక ఏకమైనట్లు వ్రాసిరి. 40మంది వ్రాసిన వ్రాతలలో గల ఈ గొప్ప ఐక్యతను గూర్చి మనమే మని చెప్పుకొందుము? దైవావేశములేని సామాన్యమానవులే దానికి కర్తలని మనము చెప్పుదుమా? లేక బైబిలు లేఖకులు గ్రంథకర్తలకు కర్తయైన వానిచే నడిపించబడిరని చెప్పుట మరింత సమంజసము కాదా?

**ప్రకృతిని-బైబిలునుపరిశీలించుదాం**

దేవుడున్నాడని నమ్మువారందరు ఆయనే ప్రకృతికి కూడా కర్తయని అంగీకరింతురు. దేవుని ప్రకృతిగ్రంథము నకు బైబిలుకు అత్యంత సన్నిహిత సంబంధము గలదు. ఈ రెండును ఒకే వ్యక్తి వలన కలిగెననుటలో సందేహము లేనంతటి సన్నిహితత్వము గలదు. ప్రకృతి,బైబిలు ఈ రెండును సామాన్యసంగతులలోను,గంభీర సంగతులలోను ఒకే విధముగ నున్నవి. ప్రకృతికూడ ఒకవైపున మనకు అతిసూక్ష్మముగ నగుపడును. వ్యవసాయ కుడు పొలమును ఎప్పుడు దున్ని, విత్తనమును జల్లవలెనో ఎరుగును. విత్తన ములు మొలకెత్తగా పంట పెరుగుటకతడు భూమినెట్లు సాగుచేయువలెనో అతడెరుగును. అయినను గొప్ప మేధావులు కూడా వివరించలేని గంభీర సంగతులు ప్రకృతి యందు ఇమిడి యున్నవి. విత్తనములో ఇమిడి యున్న"జీవము"అను శక్తియేమి? విత్తనము భూమిలో నాటబడిన తరువాత అది భూమి వెలుపలకెట్లు మొలకెత్తును? అది ఒక మొక్కవలే పెరిగి తన జాతి ప్రకారమే ఎట్లు ఫలములనునిచ్చును? వీటన్నిటికి గొప్ప శాస్త్రవేత్తలు కూడ జవాబీయలేరనుట సత్యము.

మనమందరము సాధారణముగా ఉపయోగించునది ఆహారము. మనము జీవించుప్రతిదినముదానిని భుజించెదము. అది చాల సూక్ష్మమైన పనియే. చిన్నపిల్ల వాడు కూడ ఇట్టే అన్నము తినుట ఎరుగును. మన ప్రాణము మనము భుజించు ఆహారముపై ఆధారపడి యున్నది. జీర్ణక్రియను మనమెరుగము. మనము తినుచున్న ఆహారము ఎట్లు జీర్ణ మగుచున్నదో,ఎట్లు రక్తముగాను,శక్తిగాను మారుచున్నదో మనలో ఎవరికిని తెలియదు.

బైబిలునందు కూడా అట్లేచిన్న పిల్లవాడు సహితము అర్థము చేసికొనగల్గు నట్టి సత్యములున్నవి. దేవుని యెడలమన బాధ్యతను గూర్చిన విషయములు మనము తప్పుచేయుటకు వీలులేనంత విపులముగా అందు వ్రాయబడెను. అయితే గొప్ప మేధావులు కూడ విప్పిచెప్పలేని మర్మసత్యములందున్నవి. ప్రపంచమందనేక మేధావులు బైబిలు పఠించుటలో తమ జీవితకాలమంతయు వెచ్చించినను దాని పై పై పొరలనే తెలిసి కొనగల్గితిమని చెప్పిరి.

స్వవిరుద్ధ సంగతుల వలె కన్పడు సందర్భములలో బైబిలు ప్రకృతి ఒకే విధముగనున్నవి.ఒకచిన్న రాయిని నీటి పై భాగమునను,ఒకపెద్ద బెండును నీటి అడుగు భాగమునను వదిలిన యెడల రాయి క్రిందకును,బెండు పైకిని వచ్చును.ప్రకృతి నూత్రములకిది విరుద్ధమువలె మనకు కన్పించును. అయితే భూమ్యాకర్షణ సూత్రములను మనమెరిగిన యెడల ఆ స్వవిరుద్ధ సంగతి వలే కన్పడునది మాయమగును.సందేహ శీలునికి లేక పైపైనే చదువువానికి బైబిలు నందు కూడఅట్లేకొన్ని స్వవిరుద్ధములవలె కన్పడు సంగతులు ఁటస్థించును.అయితే ఈయబడిన వాస్తవముల నన్నిటిని జాగ్రత్తగా అతడు చదివిన,అవి మాయమై పోవును.ఉదా;గలతీ6:2లో పౌలు గలతీ యులకు కిట్లు చెప్పెను:

"ఒకని భారము నొకడు భరించి ఈలాగున క్రీస్తునియమమును పూర్తిగా నెరవేర్చుడి".అయితే5వ వచనములో "ప్రతివాడు తన బరువును తానే భరించు కొనవలెను గదా?"యని అతడు మరల చెప్పెను.ఇక్కడ ఒకదానికొకటి విరుద్ధముగా నున్నట్లడుపడుచున్నది. జాగరూక పఠనము వలన ఇక్కడ పౌలు రెండు రకములైన భారములను గూర్చి చెప్పుచున్నట్లు మనము గమనించుదము. ఒకరినొకరు భరించుకొను ధన,విచార, సంతోషభారములు కలవు.అయితే ఒకడు దేవుని యెడల తనకుగల బాధ్యత భారము కూడ కలదు.దానిని మరి యొకడు భరించలేడు.ప్రకృతిలోవలెనే, బైబిలునందున్న వాస్తవముల నన్నిటి నెరుగుట వలన స్వవిర్ధు సంగతుల వలె కన్పడునవి ఇట్లే మాయమగును.

మానవుని నిత్యావసరములకు ప్రకృతి,బైబిలు ఈ రెండును ఒకే విధముగ ఉపయోగపడుచున్నవి.ప్రకృతిలో మనము పీల్చుకొను గాలి,త్రాగేనీరు,భుజించు ఆహారము ఒక ప్రత్యేక జాతికి ఏర్పడినవి కావు.అన్ని యుగములలో నివసించిన మానవులందరికి అవి అవునరమై యున్నవి.వృద్ధులు,యౌవనులు,ధనికులు, ధనహీనులు,స్వతంత్రులు,బానిసలు,ప్రతివారును తమతమ భౌతిక అవుసరతలను ప్రకృతి వలన తీర్చుకొందురు.

బైబిలును మనము గమనించిన, అదియునట్లే మానవులందరికి ఉపకారి వలెనున్నది.జాతి,కుల,కాల,వివక్షత లేక అందరి హృదయములను ఒడిసిపట్టుకొన గల్గిన సమాచారమందిమిడి యున్నది. మానవులు ఏయే దేశములలో నున్నను వారు"మన బైబిలు"అని ఈ గ్రంధమును గూర్చి చెప్పుకొందురు.

బైబిలు గ్రంధకర్త యెవరు?ఇంత వరకు చూపిన ఋజువులను బట్టి అతడు మానవుడు కాదు అని తేటబడినది. మానవుడు వ్రాయగల్గినను దానిని అతడు వ్రాసియుండలేదు.నాస్తిక ప్రపంచమును తల్లడిల్ల చేయుచుయుగయుగములలోను, నిలిచిన ఒకే ఒక్క సరియైన జవాబు

దీనికి కలదు. అది "ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదుగాని,మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగా పలికిరి" అనునది (2పేతురు 1:21). బైబిలు దేవుని వాక్యము. దానిని విని విశ్వసించి దానికి లోబడిన యెడల నీవు ధన్యుడవు.

-జామువాగూటం.

## దేవుడు హృదయమును ఎట్లు తెరచును?

(How does the Lord open the Heart?)

"అప్పుడు లూదియ యను దైవభక్తి గల స్త్రీ వినుచుండెను. ఆమె ఊదా రంగు పొడిని అమ్ము తుయతైర పట్టణస్థురాలు. ప్రభువు ఆమె హృదయమును తెరచెను. గనుక ప్రభువు చెప్పిన మాటలయందు లక్ష్యముంచెను" అని అపో.కా16:14లో వ్రాయబడియున్నది. అయితే ప్రభువు ఒకని హృదయమును ఎట్లు తెరచును? అనునది మన ప్రశ్న.

**1. ఇక్కడ హృదయమును అనుమాట లూదియ యొక్క గ్రహణశక్తిని సూచించుచున్నది:** ఒకడు వాక్యమును వినుచున్నప్పుడు అతడు లేక ఆమె ఆలోచించును(మత్తయి9:4; హెబ్రీ4:12) గ్రహించును(మత్తయి13:15), యోచించును (మార్కు2:6), విశ్వసించును(యోహాను12:40; రోమా10:10) అని లేఖనములు తెలియజేయుచున్నవి. అందునుబట్టి పరిశుద్ధాత్మావేశమువలన లూకా లూదియ యొక్క హృదయము తెరువబడెనని వ్రాసినప్పుడు ఆమె వినిన వాక్యమును గ్రహించుకొనెనని తెలియజేయుచున్నాడు (లూకా24:45; అపో: 26:18); ఆమె సువార్తనంగీకరించుటకు సుముఖముగా యుండెను (అపో. 8:6,12; హెబ్రీ12:1,2). ఎఫెసి 1:18లో "మీ మనోనేత్రములు వెలిగింపబడినందున" అను మాట యున్నది. అనగా మీ విజ్ఞతను బట్టి గ్రహించుకొనినందున యని దాని యర్థము.

**2. లూదియ యొక్క గ్రహణశక్తిని ప్రభువు సత్యము వలన తెరిచారు.**

1కొరి15:12; యాకో1:12. యేసే రక్షకుడని లూదియ అంగీకరించునట్లు సత్యము అన్ని అభ్యంత్యరములను నిర్మూలించెను. అదేరీతిగా ప్రభువు మన హృదయములను తెరచును (లూకా18:15). నేడు కుడా అదే పద్ధతిని ఆయన వినియోగించుచున్నారు(2థెస్స 2:13,14; కీర్త119:104,105,130; 19:7; యోహాను6:63; 8:31,32).

**3. లూదియ వాక్యమును వినుటకును, విధేయత చూపుటకును నిరాకరించిన యెడల ఆమె హృదయమును మూసివేసికొనెనని చెప్పుకొనవచ్చును.**

ఈ వచనమును గమనించుము: "నేటి వరకును మోషే గ్రంథము వారు చదువునప్పుడెల్ల ముసుకు వారి హృదయముల మీద నున్నది గాని వారి

హృదయము ప్రభువైపునకు ఎప్పుడు తిరుగునో అప్పుడు ఆ ముసుకు తీసివేయబడును"(2కొరి3:15-16).

ప్రభువు లూదియ యొక్క హృదయమును తెరచెను అనగా,గతంలో ఏదో ఒక విధముగా ఈమె హృదయము మూసికొనియుండెననిఅర్థమువచ్చుచున్నది. పాప జీవితము వలన ఆమె హృదయము గట్టిబడిపోయి మూసుకొని యుండలేదు,ఏలయనగా ఆమె దేవుని దేవుని ఆరాధించడములో ఆసక్తిపరురాలై యుండెను..భక్తిగల యూదుల యొక్క హృదయమువలెఆమె హృదయముకూడా క్రీస్తు విషయమై మూసుకొనియుండెను. అనేకులైన యూదులు యేసు విషయమైన సత్యమును గ్రహించక తమ హృదయములను కఠినపరచుకొని యుండిరి.ఆయన వారికి అడ్డుబండగా యుండెను(యోహా15:44;1కొరి1:23). అయితే లూదియ క్రీస్తును గూర్చిన సత్యవాక్యమును పౌలు ద్వారా వినగా ఆమె గ్రహించుకొని,దానిని స్వీకరించి బాప్తిస్మము పొంది క్రైస్తవురాలయ్యింది. ఈ విధముగా దేవుడు లూదియ యొక్క హృదయమును తెరచెను.

-మైక్ బెన్సన్

## అబానాయును,ఫర్పరును

(Abanah and Pharpar)

అబానాయును ఫర్పరును దమస్కులోని రెండునదులు. 2వరాజులగ్రంథము 5వ అధ్యాయములో మనకగుపడు నయమాను అను సిరియా దేశపు సైన్యాధిపతి ఇశ్రాయేలు దేశములో యున్ననదులన్నిటికంటే ఈ రెండు నదులు శ్రేష్టమైనవని తలంచాడు.నయమాను మహాపరాక్రమ శాలియైు అతడు తనయజమానుని దృష్టికి ఘనుడై దయపొందినవాడయెనని బైబిలు చెప్పుచున్నది(2రాజు5:1).గాని అతడు కుష్టరోగి! అయితే ఇశ్రాయేలు దేశము నుండి చెరగొనిన ఒక చిన్నది నయమాను యొక్క కుష్టరోగమును బాగుచేసే దైవజనుడొకడు తన దేశములో యున్నాడనివానికి తెలియజేసింది.వెంటనే సమయమును పోనీయకుండా అతడు తన గుఱ్ఱములు,రథము వెంటబెట్టుకొని ఇశ్రాయేలు దేశమునకు వచ్చెను.అతడు ప్రవక్త ఇంటి దగ్గరకు రాగానే,నయమాను యొక్క గర్వమునణుచుటకును,తనను బాగుచేయువాడు దేవుడే గాని మానవుడు కాదని నేర్పించుటకును,ప్రవక్త తన యింటిలో నుండి సయితము బయటికి రాకుండా, నయమాను యొర్దానునదికి పోయి ఏడుమారులు మునిగిన యెడల అతని కుష్టరోగము పోవునని కబురు పంపెను.ఈ మాటవిని నయమాను బహు రౌద్రుడై తిరిగి వెళ్లిపోవుటకు నిశ్చయించుకొని, "దమస్కు నదులైన అబానాయును, ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నిటికంటే శ్రేష్ఠమైనవి

కావా? వాటిలో స్నానము పొంది శుద్ధినొందలేనా'' యని తిరిగి వెళ్లిపోవుచుండెను అయితే మార్గములో అతని సేవకులలో ఒకడు అతని శాంతింపజేసి యొర్దానులో ఏడుమారులు మునుగుటకు అతనిని ఒప్పించెను.

నయమాను యొర్దాను నదికివచ్చి ప్రవక్త చెప్పినట్లు ఏడుమారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహామువలనై అతడు శుద్ధుడాయెను. నయమాను ఆ రోజు నేర్చుకొనిన గొప్పపాఠము యేమంటే, దేవుడు ఏదైనా చెప్పియుంటే దాని స్థానములో ఇంకొకటి మనము చేయరాదు. దేవుడు తన ప్రవక్త ద్వారా యొర్దాను అన్నప్పుడు ఆయన అబానాయు, ఫర్పరును అని అనలేదు. నోవహును చితిసారకపు మ్రానుతో నిర్మించుమని దేవుడు చెప్పినప్పుడు నోవహు అట్లు చేసెను. దేవుడతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తుచేసెను(ఆది 6:22). పౌలు "పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధకలుగుటకై వ్రాయబడి యున్నవని బైబిలు చెప్పుచున్నది"(రోమా 15:4). మనము ఈ నాడు నేర్చుకోనవలసిన పాఠంయేమంటే దేవుడు చెప్పినవాక్యాన్ని మార్చకూడదు, దానికి కలుపకూడదు, దాని స్థానముననే వేరొకదానిని ఉంచకూడదు. (ప్రకటన 22:18-19). ఉదాహరణకు "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని మార్కు16:16చెప్పుచున్నది. దానిని మనం సరిగ్గానే అర్ధము చేసికొనగలము. అంటే రక్షించబడాలంటే ఒకడు నమ్మాలి బాప్తిస్మము పొందాలి. నమ్మి బాప్తిస్మము పొందినప్పుడు రక్షింపబడునని యేసు యేసుచెప్పినప్పుడుఆయన పసిబిడ్డలనుగూర్చి ఆ మాటలు చెప్పలేదు. పసిబిడ్డలు నమ్మలేరు గనుక వారికి ఈ యాజ్ఞ వర్తించదు. బాప్తిస్మము అనగా నీటిలో ముంచబడుట, అది చిలకరింపు, కుమ్మరింపుకాదు. 'బాప్టిజో'అను గ్రీకు పదమునకు సంపూర్తిగా ముంచుట లేక పాతి పెట్టుటయని అర్ధము. కొలస్స2:12 "మీరు బాప్తిస్మమందు ఆయనతోకూడా పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడా లేచితిరి"యని పౌలు చెప్పాడు. మొదట్లో నయమాను దేవుని ఖచ్చితమైన, తేలికయైన అజ్ఞను ఎట్లు నిరాకరించాడో, అట్లే అనేకులు సువార్తయిచ్చు తేలికయైన అజ్ఞలను నిరాకరించుచున్నారు. బాప్తిస్మము పొంది పాపము నుండి శుద్ధులగుటకు నిరాకరించుచున్నారు. గాని దేవుడు చెప్పినట్లు చేస్తే మంచిదని నయమానుకు తన సేవకుడు బోధించగా, అతడు దేవుని మాటలకులోబడి శుద్ధుడయ్యాడు. అదే రీతిగా నేడు మీరును యేసుప్రభువును నమ్మి, బాప్తిస్మము పొందితే మీరును రక్షింపబడగల్గుదురు.

-సన్నీ డేవిడ్

# భిన్నమైన వారితో జీవించుట

## (Living with Difficult People)

“వారు తనతో కూడా యుండునట్లును దయ్యములను వెళ్లగొట్టు అధికారము గలవారై సువార్త ప్రకటించుటకును వారిని పంపవలెనని ఆయన పండ్రెడుమందిని నియమించెను”(మార్కు3:14-15).

యేసు యొక్క పండ్రెండు మంది అపొస్తలులు ఒక్కొక్కరి నుండి వేరుగా యున్న వ్యక్తులు,వారి యొుక్క వ్యక్తిత్వములోను మనస్తత్వములోను యున్న తారతమ్యాన్ని గమనించుదము.

పేతురు యోహానులు భిన్నమైనవారు. పేతురు తొందరపాటు గలవాడు.వెంటనేమాట్లాడేస్తాడు.యోహాను నెమ్మదిపరుడు, బహుశ ప్రార్థనాపరుడు. అతడు “యేసు ప్రేమించిన శిష్యుడు”.గాని నిజానికి అతడు కోపిష్టుడు.పగతీర్చుకొనే స్వభావము గలవాడు(లూకా9:54).క్రీస్తు రాజ్యములో ప్రధమస్థానమును అభ్యర్థించి అతడు, యాకోబు కూడా మిగతా వారికి కోపము పుట్టించారు.

నతనియేలు,తోమాలలో కూడా కొన్ని వ్యత్యాసములున్నాయి.నమ్మడానికి నతనియేలుకు యేమి కష్టము కలుగలేదు. (యోహాను1:45-49).సందేహించుతోమా నిజానికి సందేహించలేదు గాని ఇంకా ఎక్కువ రుజువు కొరకు కాంక్షించాడు (యోహాను20:25-28).

మత్తయి సీమోనుల కంటె భిన్నమైన వారుండరు.మత్తయి పన్నులు వసూలు చేసేవాడు.రోమీయుల ఉద్యోగి. సీమోను జెలోతేలకు చెందినవాడు.రోమా ప్రభుత్వాన్ని వారి సేవకులను పడద్రోయడానికి పని చేసేవారు జెలోతేలు. నిజానికి ఈ జెలోతే ఉగ్రవాదులు పన్ను వసూలు చేసే ప్రతివానిని చంపబూనుకొన్నవారు. యేసు సమక్షములో కాకుండా ఇంకో సందర్భములో సీమోను మత్తయిని కలసి కొన్నట్లయితే,బహుశ అతనిని కత్తితో పొడిచి చంపేసేవాడు.

ఈ మనుష్యులలో యున్న వ్యత్యాసం గల ఇంకో ఆరుగురితో జతకూర్చబడ్డారు.వారిలో ఎవడు పరిపూర్ణుడు కాదు.గాని ప్రతివాడు తన సమస్యలను కష్టాలను తనతో కూడ తెచ్చుకొన్నాడు. ఈ 12మందిని గుమిగూడ్చితే వారు ఒండొరుల యెడల అనుమానం,అసూయ కలిగినవారు.

ఇట్టివారిని యేసుప్రభువు మలిచి ఆయన ఆజ్ఞకు లోబడి ఆయన వాగ్దానమును నెరవేర్చు గుంపుగా తయారు చేసారు.వారు సర్వలోకానికి వెళ్లి సువార్తను ప్రకటించాలని. ఆయన ఆజ్ఞ యిచ్చారు. ఆయన చేసిన వాగ్దానము“ఇదిగో

యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో కూడ యుందును" (మత్తయి28:18-20).

ఈ ఆజ్ఞనుసారముగా,ఆయన వాగ్దానమును బట్టి వారయన పనిని విజయవంతముగా కొనసాగించారు. (కొలస్స1:23).

యేసు యొుక్క ఆజ్ఞ విన్న తరువాత ఆ పండ్రెండు మంది యెరూషలేములో కూడుకొని ప్రపంచములో ఒక్కొక్కడు ఒక భాగమునకు సువార్త చాటాలని నిశ్చయయించుకొన్నారని యూసిబియస్ అను చరిత్రకారుడు వ్రాసాడు.నిజానికి వారిలో ప్రతివాడు తనది కాని దేశములో హతసాక్షులై మరణించాడు.

అట్టి భిన్నమైన ప్రజలలో ఐక్యత, ఏకాగ్రత యేసు కలుగజేయగలిగితే, మనకు నిరీక్షణ లేదా?యూదులను అన్యజనులను ఒకటిగా ఆయన చేయగలితే,మనలను అట్లు ఆయన చేయలేరా?(ఎఫెసీ2:13-15).సహోదరుల మధ్య భిన్నాభిప్రాయములు,అపోహలు మనలను విడదీయనీయకూడదు.మనం మానవ మాత్రులం,వ్యత్యాసాలు గలవారం అని మనం గ్రహించుకోవాలి. భిన్నాభిప్రాయముల వలన సంఘము కలతచెందకూడదు.వాటిని ఎట్లు పరిష్కరించుకోవాలో యేసు మనకు తెలియజేసారు(మత్తయి5:22-24; 18:15-17).మన వ్యత్యాసములను బట్టి ఆయన రాజ్యములో ఉపయుక్తములైన పనిముట్లుగా మనలను తయారు చేయగల ఆయన శక్తియందు నమ్మిక యుంచుదాము.భిన్న స్వభావము గల వ్యక్తులను ఆయన ఏకం చేసారు. ఇప్పుడు చేయగలరు!

– ఏన్సిల్ జెంకిన్స్

క్రీస్తు సంఘములు సమర్పించు

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

**ప్రతి ఆదివారము సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త**

**ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ**

**ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ**

**ఛానల్‌లలో వీక్షించండి**

## సంక్షిప్త వార్తలు

2015 జూలై 10వ తేదీన ముమ్మిడివరం మండలం, పోతుకూరులో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును జాషువాగూటం గారు రిబ్బరు కత్తిరించి దేవుని సేవకొరకు ప్రతిష్టించిరి. పోతుకూరులో సోదరులు ఎల్లే ప్రభాకర్ గారు నిర్విరామ కృషి చేయుచు సంఘాభివృద్ధి కొరకు పాటుపడుచున్నారు.

పోతుకూరులో ఆలయ ప్రతిష్ట ఘనముగా జరిగెను, స్థానికులు, సంఘస్థులు వివిధ ప్రాంతముల నుండి వచ్చిన సుహార్తికులతో ఆ రోజు అక్కడ పండుగ వాతావరణము ఏర్పడెను. అమెరికా నుండి వచ్చిన ముగ్గురు యౌవనస్థులు కూడ ఆ కార్యక్రమములో పాల్గొనిరి, దేవుని స్తుతించిరి. జాషువా గారు సతీసమేతముగాను, రిక్కీ, సుదీప గూటం గార్లును వారి కుమారుడు జస్టిన్ గూటం గారును హాజరవ్వగా జాషువా గారు, రిక్కీ గార్లు కూడ వాక్యోపదేశము చేసిరి. తదుపరి అమెరికా నుండి వచ్చిన జెస్సీబేల్ గారును, రేమాండ్ గారును క్లుప్తముగా మాట్లాడి స్థానిక సంఘమును సంతోషపరచిరి. హాజరైన ముఖ్య అతిధులందరినీ స్థానిక సంఘము శాలువలతోను, పూలమాలలతోను సత్కరించిరి. వచ్చిన వారందరికీ మంచి విందు భోజనమేర్పాటు చేయబడెను.

అమెరికానుండి వచ్చిన రిక్కీ గూటం గారి ముగ్గురు మిత్రులు జూలై 1నుండి 20వరకు కాకినాడలో యుండి క్రీస్తుసంఘ పరిచర్యలో చురుకుగా పాల్గొనిరి. యువకులగు జెస్సీబేల్ మరియు రేమండ్ గార్లును, ఒక యువతి మేడిసన్ విలియమ్స్ గారును రిక్కీ గారు నడుపుచున్న పిల్లల ఆశ్రమములో యుంటూ వారికి, పాటలు, వాక్యము నేర్పుతు చక్కటి క్రైస్తవ వాతావరణమును వారికి సంకల్పించిరి. మరియు రిక్కీ గారితో కలసి ఆ ముగ్గురు నర్సీపట్నం, వెంకటపురం, పోతుకూరు, వీధివారిలంక, తుని దేవగుప్తం ప్రాంతములు సందర్శించి వాక్యపరిచర్య చేసి మంచి మాదిరిని నెలకొల్పిరి. పిల్లల ఆశ్రమములో యున్న విద్యార్థులకు స్కూల్ బేగ్స్ మరియు నోట్సుపుస్తకములు, దుస్తులు పంపిణీ చేసిరి.

2015 జూలై 30వ తేదీ సాయంత్రం రాబిన్ గూటం గారు ఆయన సతీమణి రేచల్ గూటం గారు బయలుదేరి 31 వ తేదీ రాత్రికి అమెరికా క్షేమముగా చేరుకొనిరి. రోని గూటం దంపతులు ఇప్పటికే అమెరికాలో యున్న సంగతి చదువరులకు విదితమే.

**కాకినాడ సత్యవాణి ద్వారా జరుగుచున్న వివిధ సత్యసువార్త కార్యక్రమములను మీ అనుదిన ప్రార్థనలలో జ్ఞాపకముంచుకొనమనవి.**

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
సత్యవాణి టి.వి. కార్యక్రమములను దిగువ
సమయాల్లో వీక్షించండి

ప్రతి ఆదివారము సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త
ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ
ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ
ప్రతి ఆదివారం ఉదయం7.30 గం॥లకు మన కాపరి
(గుంటూరు,తెనాలి ఏరియాలో)
ప్రతి మంగళవారం ఉదయం 7.30 గం॥లకు
UCCమ్యూజిక్ (తూర్పుగోదావరిలో) ఛానల్‌లలో వీక్షించండి.
ఈ కార్యక్రమములను తప్పక చూడండి! మీ బంధుమిత్రులకు చూపించండి!!

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.